కలం
ప్రజల గళం...
kalamdaily.com
Follow on: Kalamtelugu
గురువారం ● 09-04-2026
పేజీలు: 5

360° SINGLE TOPIC
జనగణన

# జనాభా లెక్కలు.. ఎన్నో ప్రశ్నలు



తెలంగాణలో ఫస్ట్ ఫేజ్ ఎప్పుడు?
ఏం అడుగుతారు?
సెకండ్ ఫేజ్‌లో ఏ వివరాలు తీసుకుంటారు?
నిజాలు చెబితే పథకాలు పోతాయా?
తప్పుడు సమాచారం ఇస్తే ఏమవుతుంది?
బెగ్గర్లు, మతిస్థిమితం లేని వారి వివరాలు ఎలా?
దేశ చరిత్రలో ఫస్ట్ టైమ్ డిజిటల్ మోడ్‌లో సెన్సస్

**దేశంలోనే ఫస్ట్ టైమ్ డిజిటల్ సెన్సస్ ప్రారంభమైంది. మొత్తం రెండు దశల్లో జనగణన జరుగుతున్నది. ఫస్ట్ ఫేజ్‌లో హౌజ్ లిస్టింగ్, హౌజింగ్ సెన్సస్ ఈ నెల నుంచి సెప్టెంబరు చివరి వరకు జరుగుతుంది. సెకండ్ ఫేజ్‌లో జనాభా లెక్కల సేకరణ వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఉంటుంది. స్వతంత్ర భారత్‌లో మొదటిసారి కులగణన కూడా చేపడుతున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత జరుగుతున్న మొదటి జనాభా లెక్కల సేకరణ ఇది. షెడ్యూలు ప్రకారం 2021లో సెన్సస్ జరగాల్సి ఉన్నప్పటికీ కరోనా కారణంగా వాయిదా పడింది.**

దేశవ్యాప్తంగా సుమారు 34 లక్షల మంది సిబ్బంది ప్రతీ ఒక్కరి వివరాలను సేకరించనున్నారు. తెలంగాణలో దాదాపు 94 వేల మంది స్టాఫ్ ఈ ప్రక్రియలో పాల్గొంటున్నారు. ఆన్‌లైన్‌లో వెబ్‌సైట్ ద్వారా ప్రజలే స్వచ్ఛందంగా వారి వివరాలను నమోదు చేసుకునే వెసులుబాటూ ఉన్నది. కొన్ని రాష్ట్రాల్లో ఈ నెల ఫస్ట్ నుంచి ఇది అమల్లోకి వచ్చింది. రాష్ట్రపతి, ప్రధాని, సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ తదితరులంతా ఆన్‌లైన్ ద్వారానే వివరాలను నమోదు చేసుకున్నారు. సెల్ఫ్ ఎన్యూమరేషన్ పేరుతో జరిగే ఈ ప్రక్రియ షెడ్యూలు ఒక్కో రాష్ట్రానికి ఒక్కో రకంగా ఉన్నది. తెలంగాణలో ఈ నెల 26 నుంచి మే 10వ తేదీ వరకు ఇది ఉంటుంది.

**పౌరసత్వంతో సంబంధం లేకుండా దేశంలో నివసిస్తున్న ప్రతి ఒక్కరి వివరాలు నమోదు చేయడం.. ఏ ఒక్కరి వివరాలు డబుల్ ఎంట్రీ కాకుండా చూసుకోవడం.. క్వాలిటీ డేటాను సేకరించడం.. ఈ మూడు మంత్రదండాలతో సెన్సస్ ప్రక్రియ జరగనున్నది. ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలతో ఎలాంటి సంబంధం లేకుండా ప్రతీ ఒక్కరి వివరాలను కేంద్ర హోంశాఖ పరిధిలోని సెన్సస్ రిజిస్ట్రార్ జనరల్ కార్యాలయం ఈ ప్రక్రియను చేపడుతున్నది. వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 అర్ధరాత్రి 12 గంటల సమయాన్ని రిఫరెన్సుగా తీసుకుని జననం, మరణం, సజీవం.. ఆధారంగా వివరాలను సిబ్బంది సేకరించనున్నారు.**

జనాభా లెక్కల సేకరణలో భాగంగా ఫస్ట్ ఫేజ్‌లో ఏమేం ప్రశ్నలుంటాయి?.. సెకండ్ ఫేజ్‌లో ఏముంటాయి?.. వివరాలు ఇవ్వాల్సిందేనా?.. వెల్లడించిన సమాచారం గోప్యంగా ఉంటుందా?.. వాస్తవాలు చెప్తే సంక్షేమ పథకాల అర్హత కోల్పోయినట్లేనా?.. తప్పుడు సమాచారం ఇస్తే ఏం జరుగుతుంది?.. స్థిరనివాసం లేకుండా సంచార జీవనం సాగిస్తున్నవారి వివరాలను ఎలా సేకరిస్తారు?.. హాస్టళ్లలో ఉండేవారి వివరాల సేకరణకు అనుసరించే పద్ధతేంటి?.. ఇలాంటి అంశాలపై ‘కలం’ 360 డిగ్రీస్ ప్రత్యేక కథనం.

- తెలంగాణ బ్యూరో, కలం

# చరిత్రలో కొత్త అధ్యాయం

భారతదేశ చరిత్రలోనే ఫస్ట్ టైమ్ డిజిటల్ పద్ధతిలో జనగణన జరుగుతున్నది. ప్రజల నుంచి సేకరించిన వివరాలు ఎప్పటికప్పుడు మొబైల్ యాప్ ద్వారా ప్రత్యేక వెబ్‌సైట్‌లోకి అప్‌లోడ్ అవుతాయి. అలా సర్వర్‌లోకి వెళ్లిన తర్వాత ఆ డేటాను మార్చడం/చూడడం/యాక్సెస్ చేయడం కుదరదు. అత్యంత పకడ్బందీగా జరిగే ఈ ప్రక్రియలో ప్రజలకు సంబంధించిన సమాచారమంతా గోప్యంగానే ఉంటుంది. ఏ ప్రభుత్వ విభాగానికీ షేర్ కాదు. అందుబాటులోకి వచ్చిన డిజిటల్ టెక్నాలజీతో పాటు డేటా విశ్లేషణకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కూడా వినియోగిస్తున్నట్లు కేంద్ర వర్గాలు పేర్కొన్నాయి. ఎలాంటి ఫిజికల్ ఫారాలు లేకుండా కేవలం మొబైల్ యాప్ ద్వారానే మొత్తం వివరాలను సిబ్బంది సేకరిస్తారు.

## తెలంగాణ ఏర్పాటు తర్వాత ఫస్ట్ టైమ్

తెలంగాణ ఏర్పడిన తర్వాత ఫస్ట్ టైమ్ అధికారికంగా జనాభా లెక్కల సేకరణ జరుగుతున్నది. షెడ్యూలు ప్రకారం ప్రతి పదేండ్లకోసారి కేంద్ర ప్రభుత్వం జనగణన చేయాల్సి ఉంది. ఆ లెక్కన 2021లో సెన్సస్ ప్రక్రియ జరగాల్సి ఉన్నా కరోనా కారణంగా వాయిదా పడింది. ఒకటిన్నర దశాబ్దం తర్వాత ఇప్పుడు జరుగుతున్నది. తెలంగాణ ఏర్పడిన కొత్తలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఒకే రోజు ప్రతి ఇంటికి వెళ్లి సమగ్ర కుటుంబ సర్వే చేసింది. వివరాలన్నీ ప్రభుత్వం దగ్గర ఉన్నాయి. 2023లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గతేడాది 'సీప్' పేరుతో కులగణన సర్వే చేసింది. ఆ వివరాలూ ప్రభుత్వం దగ్గర ఉన్నాయి. కానీ ఈ రెండూ కేంద్ర ప్రభుత్వం దృష్టిలో అధికారికం కాదు. సెన్సస్ చేసే అధికారం కేవలం కేంద్ర ప్రభుత్వానికే ఉన్నందున ఇప్పుడు చేయబోయే జనాభా లెక్కల సేకరణే అఫీషియల్.



## రాష్ట్రంలో ఎప్పుడు?


తెలంగాణ ప్రభుత్వం రూపొందించిన షెడ్యూల్ ప్రకారం ఫస్ట్ ఫేజ్ సర్వే మే 11 నుంచి జూన్ 9 వరకు 30 రోజుల పాటు జరుగుతుంది. సుమారు 94 వేల మంది సిబ్బంది ఈ పనుల్లో నిమగ్నమవుతారు. ఎక్కువగా ఉపాధ్యాయులే పాల్గొంటారు. ప్రతి ఇంటికి వెళ్లి వివరాలను సేకరిస్తారు. అన్ని ఇండ్లనూ కవర్ చేసేలా రాష్ట్ర సెన్సస్ డైరెక్టర్ వర్క్ డివిజన్, సన్నాహకాలను పూర్తి చేసింది. మూడు జిల్లాల్లో పైలట్ సర్వే నిర్వహించి ప్రాక్టికల్ ఇబ్బందులను పరిశీలించింది. అసలైన సర్వే కోసం సన్నాహాలు చేస్తున్నది. ఫస్ట్ ఫేజ్‌లో హౌస్ లిస్టింగ్, హౌసింగ్ సెన్సస్ వివరాలను సేకరిస్తున్నందున వ్యక్తుల వ్యక్తిగత వివరాలేవీ ఉండవు. మొత్తం ఐదు సెక్షన్లలో ఇండ్లకు సంబంధించిన వివరాలను మాత్రమే తీసుకుంటారు. అవన్నీ మొబైల్ యాప్‌లో అప్‌లోడ్ అవుతాయి. సెకండ్ ఫేజ్ సర్వే వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరుగుతుంది.

## తెలంగాణలో ఇలా..

**సెల్ఫ్ ఎన్యూమరేషన్ :** 2026 ఏప్రిల్ 26 – మే 10

**ఫస్ట్ ఫేజ్ :** 2026 మే 11 – జూన్ 9 (హౌసింగ్ సెన్సస్)

**సెకండ్ ఫేజ్ :** 2027 ఫిబ్రవరి (జనాభా లెక్కలు). షెడ్యూలు రావాల్సి ఉంది.



## సెల్ఫ్ ఎన్యూమరేషన్ చేసుకునేదెలా?

ప్రజలే స్వచ్ఛందంగా వారి వివరాలను నమోదు చేసుకోడానికి ఫస్ట్ టైమ్ సెల్ఫ్ ఎన్యూమరేషన్ విధానాన్ని కేంద్ర ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. వెబ్‌సైట్ (se.census.gov.in) ద్వారా రాష్ట్రాన్ని ఎంపిక చేసుకోవాలి. ఆయా రాష్ట్రాల షెడ్యూల్ ప్రకారమే సైట్ ఓపెన్ అవుతుంది. జిల్లా, మండలం, గ్రామం, పిన్‌కోడ్ (ఆప్షనల్) ఇవ్వాలి. ఇంటి లొకేషన్‌ను నావిగేషన్ (గూగుల్ మ్యాప్ తరహా) ద్వారా ఎంపిక చేసుకోవాలి. ఇంటి పెద్ద పేరును ఇచ్చిన తర్వాత మిగిలిన వివరాలను పొందుపర్చాలి. ఇంటి పెద్ద పేరును ఒక్కసారి ఇచ్చిన తర్వాత మార్చడానికి వీలుండదు. ప్రతి ఇంటికి ఒక మొబైల్ నెంబర్‌నే వాడాలి. అదే మొబైల్ నెంబర్‌ను మరో ఇంటికి వాడడానికి వీలుండదు. ఏ భాషలో వివరాలను పొందుపర్చనున్నదీ ఎంపిక చేసుకున్న తర్వాత లాంగ్వేజ్ సెలెక్షన్ మార్చడానికి వీలుండదు. పొందుపర్చిన మొబైల్ నెంబర్‌కు వచ్చిన ఓటీపీ ద్వారా మొత్తం వివరాలను ఇవ్వాలి. మనం వివరాలన్నీ ఇచ్చిన తర్వాత ప్రివ్యూలో చూసుకోవచ్చు. అన్నీ సక్రమంగా ఉన్నాయనుకుంటే సబ్‌మిట్ చేయొచ్చు.. లేదా డ్రాఫ్ట్ లో సేవ్ చేసుకోవచ్చు. అప్‌లోడ్ చేసిన తర్వాత ఒక ఐడీ వస్తుంది. దాన్ని సేవ్ చేసుకోవాలి (ఎక్కడైనా రాసిపెట్టుకోవాలి). ఫిజికల్ సర్వేకు వచ్చినప్పుడు ఆ ఐడీని ఎన్యూమరేటర్‌కు అందించాలి. దాని ప్రకారం మొత్తం వివరాలు మొబైల్ యాప్‌లో డిస్‌ప్లే అవుతాయి. అదనంగా ఏవైనా వివరాలను యాడ్ చేయాలనుకున్నా, మార్పులు చేయాలనుకున్నా ఎన్యూమరేటర్ ద్వారా చేసుకోవచ్చు.

## దేశంలో ఎప్పటి నుంచి ఎప్పటి వరకు?

కేంద్ర ప్రభుత్వం జనగణన కోసం నిర్దిష్ట షెడ్యూల్ రూపొందించింది. మొత్తం రెండు దశల్లో జరిగే ప్రక్రియలో భాగంగా ఫస్ట్ ఫేజ్ ఏప్రిల్ నుంచి మొదలైంది. సెప్టెంబర్ చివరి వరకు కొనసాగనున్నది. సెకండ్ ఫేజ్ వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరగనున్నది. ఒక్కో రాష్ట్రంలోని వాతావరణ పరిస్థితులు, విద్యార్థుల పరీక్షలు, అసెంబ్లీ సమావేశాలు.. ఇలాంటివన్నీ పరిగణనలోకి తీసుకుని షెడ్యూల్‌ను రాష్ట్ర ప్రభుత్వాలే డిసైడ్ చేయాలని కేంద్రం వెసులుబాటు కల్పించింది. ఆ ప్రకారం అన్ని రాష్ట్రాల్లో ఏప్రిల్-సెప్టెంబర్ మధ్యలో ఫస్ట్ ఫేజ్ జరగనున్నది. లాంఛనంగా ఇది ప్రారంభం కావడానికి ముందు ఆయా రాష్ట్రాల్లో సెల్ఫ్ ఎన్యూమరేషన్ (ప్రజలు స్వచ్ఛందంగా వారి వివరాలను ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకోవడం) మొదలైంది. 15 రోజుల పాటు జరిగే ఈ ప్రక్రియ ముగిసిన మరుసటి రోజు నుంచి ఆయా రాష్ట్రాల షెడ్యూల్ ప్రకారం ఇంటింటికీ తిరిగి హౌస్ లిస్టింగ్, హౌసింగ్ సెన్సస్ మొదలవుతుంది.

## ఫస్ట్ ఫేజ్ షెడ్యూల్ ఇదీ..

| రాష్ట్రం/కేంద్రపాలిత ప్రాంతం | సెల్ఫ్ ఎన్యూమరేషన్ | హౌస్ లిస్టింగ్ & హౌస్ సెన్సస్ |
|---|---|---|
| అండమాన్ నికోబార్, ఢిల్లీ, గోవా, కర్ణాటక, లక్షద్వీప్, మిజోరం, ఒడిశా, సిక్కిం | ఏప్రిల్ 1 – ఏప్రిల్ 15 | ఏప్రిల్ 16 – మే 15 |
| దాద్రా నగర్ హవేలీ, డమన్ డయ్యూ | ఏప్రిల్ 5 – ఏప్రిల్ 19 | ఏప్రిల్ 20 – మే 19 |
| ఉత్తరాఖండ్ | ఏప్రిల్ 10 – ఏప్రిల్ 24 | ఏప్రిల్ 25 – మే 24 |
| మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, అరుణాచల్ ప్రదేశ్, చండీగఢ్, ఛత్తీస్‌గఢ్, హర్యానా | ఏప్రిల్ 16 – ఏప్రిల్ 30 | మే 1 – మే 30 |
| బిహార్ | ఏప్రిల్ 17 – మే 1 | మే 2 – మే 31 |
| తెలంగాణ | ఏప్రిల్ 26 – మే 10 | మే 11 – జూన్ 9 |
| పంజాబ్ | ఏప్రిల్ 30 – మే 14 | మే 15 – జూన్ 13 |
| మహారాష్ట్ర, మేఘాలయ, రాజస్థాన్ | మే 1 – మే 15 | మే 16 – జూన్ 14 |
| ఉత్తరప్రదేశ్ | మే 7 – మే 21 | మే 22 – జూన్ 20 |
| జమ్మూ కాశ్మీర్, లడఖ్, పుదుచ్చేరి | మే 17 – మే 31 | జూన్ 1 – జూన్ 30 |
| హిమాచల్ ప్రదేశ్ | జూన్ 1 – జూన్ 15 | జూన్ 16 – జూలై 15 |
| కేరళ, నాగాలాండ్ | జూన్ 16 – జూన్ 30 | జూలై 1 – జూలై 30 |
| తమిళనాడు, త్రిపుర | జూలై 17 – జూలై 31 | ఆగస్టు 1 – ఆగస్టు 30 |
| అసోం | ఆగస్టు 2 – ఆగస్టు 16 | ఆగస్టు 17 – సెప్టెంబర్ 15 |
| మణిపూర్ | ఆగస్టు 17 – ఆగస్టు 31 | సెప్టెంబర్ 1 – సెప్టెంబర్ 30 |

ఫస్ట్ ఫేజ్‌లో హౌసింగ్ సర్వే, హౌస్ లిస్టింగ్ మాత్రమే ఉంటున్నందున.. ఐదు కేటగిరీల్లో మొత్తం 33 అంశాలకు సంబంధించిన సమాచారాన్ని ఎన్యూమరేటర్లు సేకరిస్తారు. ఇండ్ల అడ్రస్, అవి ఏ తరహా నిర్మాణాలు, ఇంట్లో ఉన్న కనీస సౌకర్యాలేంటి? ఇంట్లో ఎంతమంది (ఎన్ని కుటుంబాలు) ఉంటున్నారు? ఆర్థిక స్థితిని తెలియజేసే వస్తువులు ఏమున్నాయి? వారి జీవన శైలి ఎలా ఉన్నది?.. తదితర వివరాలను సేకరిస్తారు. తప్పుడు సమాచారం ఇచ్చినా, ఉద్దేశపూర్వకంగా దాటవేసినా.. అది నిర్ధారణ అయితే సెన్సస్ చట్టం (1958) ప్రకారం చర్యలు తీసుకునే అధికారం సెన్సస్ రిజిస్ట్రార్ జనరల్‌కు ఉంటుంది. వివరాలు ఇవ్వడం ప్రతి ఒక్కరి బాధ్యతగా ఎన్యూమరేటర్లు అవగాహన కల్పిస్తారు. ఈ వివరాలన్నీ గోప్యమేనని, బయటకు లీక్ కావని అర్థం చేయిస్తారు.



## ఇండ్ల సర్వేలో సేకరించే అంశాలు:

- ఇంటి నెంబర్, ఫ్లోర్ నెంబర్
- వీధి పేరు, కాలనీ పేరు
- మండలం, జిల్లా
- పిన్ కోడ్ నెంబర్
- సెన్సస్ హౌస్ నెంబర్ (ఇది ఎన్యూమరేటర్లకు సంబంధించిన అంశం)

## ఇంటి నిర్మాణ వివరాలు:

- ఇల్లు సిమెంటు కాంక్రీట్‌తో కట్టిందా? ఎన్ని అంతస్తులు ఉన్నాయి?
- ఇంటి పైకప్పు స్వభావం (సిమెంట్/ఇనుప రేకులు, మట్టిమిద్దె, చెక్కలు, పెంకులు (హ్యాండ్ మేడ్/మెషీన్ మేడ్), ఇటుకలు, షాబాద్ రాయి, పూరి గుడిసె (గడ్డి, తాటాకు, వెదురు, చెక్కలు, ఇతరాలు)
- ఇంటి గోడల స్వభావమేంటి (సిమెంట్, రాయి, ఇసుక, మట్టి, వెదురు, చెక్క, కర్రలు, పాలిథీన్/ప్లాస్టిక్)
- ఇంట్లో ఫ్లోరింగ్ ఏంటి (టైల్స్, గ్రానైట్ స్టోన్, నాపరాయి, సిమెంట్ గచ్చు, మొజాయిక్, మట్టినేల, ఇతరాలు)
- భవనం వినియోగం (ఇల్లు/హాస్టల్/ఆఫీస్/ఫ్యాక్టరీ)
- ప్రస్తుతం నివాస యోగ్యమైనదేనా?

## భవనం వినియోగం:

- ఇంటితో పాటు ఇతర అవసరాలు
- దుకాణం/ఆఫీస్
- స్కూల్/కాలేజీ/హాస్టల్
- హోటల్/లాడ్జి/గెస్ట్ హౌజ్
- హాస్పిటల్/డిస్పెన్సరీ/మెడికల్ షాప్
- ఫ్యాక్టరీ/వర్క్ షాప్ / వర్క్ షెడ్
- ప్రార్థనా స్థలం
- ఇంటి అవసరాలకు కాకుండా ఇతరాల కోసం
- ఖాళీగా ఉన్నది (ఎలాంటి వినియోగం లేకుండా)

## అడ్వాన్స్ (ఆర్థిక స్థితి తెలియజేసే) సౌకర్యాలు :

- రేడియో, ట్రాన్సిస్టర్ ఉన్నదా? వాడుతున్నారా?
- టీవీ ఉన్నదా (కలర్, బ్లాక్ అండ్ వైట్, ఎల్ఈడీ, ఎల్‌సీడీ, స్మార్ట్), దూరదర్శన్ ఫ్రీ డిష్ కనెక్షన్, ఇతర డిష్ కనెక్షన్ లేదా కేబుల్ కనెక్షన్, ఇంట్లో ఎన్ని టీవీలు ఉన్నాయి?
- ఇంటర్నెట్ కనెక్షన్ (బ్రాడ్‌బ్యాండ్, ఎయిర్ ఫైబర్)
- ల్యాండ్ లైన్ ఫోన్, మొబైల్ ఫోన్, స్మార్ట్ ఫోన్, ఎన్ని వాడుతున్నారు?
- కంప్యూటర్, ల్యాప్‌టాప్, ట్యాబ్, ఎన్ని వాడుతున్నారు?
- టూ-వీలర్స్ ఉన్నాయా? (సైకిల్, మోపెడ్, స్కూటర్, మోటార్ సైకిల్), ఎన్ని వాడుతున్నారు?
- ఫోర్ వీలర్స్ ఉన్నాయా? (ఆటో, కారు, జీపు, వ్యాన్)

## లైఫ్ స్టైల్ వివరాలు:

- ప్రధానమైన ఆహారమేంటి (అన్నం, చపాతీలు, గోధుమ పదార్థాలు, జొన్న, మొక్కజొన్న, సజ్జలు, ఇతరాలు)
- మొబైల్ నెంబర్ (సెన్సస్ అవసరాల కోసం)

## రాష్ట్రంలోని భవనాలన్నింటి వివరాల సేకరణ

సెన్సస్ ఫస్ట్ ఫేజ్‌లో భాగంగా రాష్ట్రంలోని అన్ని భవనాలను ఎన్యూమరేటర్లు విజిట్ చేసి వివరాలు సేకరిస్తారు. ఇల్లు, ఆఫీసు, షాప్, వర్క్‌షాప్, షెడ్.. కమర్షియల్, రెసిడెన్షియల్, ఇన్‌స్టిట్యూషనల్.. ఇలాంటి తేడాలేవీ లేకుండా అన్నీ రికార్డుల్లోకి ఎక్కుతాయి. చివరకు మసీదు, చర్చి, ఆలయం, మందిరం.. వివరాలు కూడా నమోదు చేస్తారు. ఇక వర్కింగ్ మెన్/ఉమెన్ హాస్టళ్లు, పేయింగ్ గెస్ట్ హాస్టళ్లు, గెస్ట్ హౌస్‌లు కూడా లెక్కల్లోకి వస్తాయి. స్థానిక సంస్థలు లేదా రెవెన్యూ రికార్డుల్లో లేని, ఇంకా ఇంటి నెంబర్ అలాట్ కాని భవనాల వివరాలను కూడా సేకరిస్తారు. వీటికి ప్రత్యేకంగా సెన్సస్ రికార్డుల కోసం స్పెషల్ నంబర్ కేటాయించుకుంటారు. ఒకవేళ ఆ భవనం/కట్టడం వినియోగంలో లేకపోయినా ఆ వివరాలను మొబైల్ యాప్‌లో పొందుపరుస్తారు?



## కుటుంబాల వివరాలు :

- ఇంట్లో ఎన్ని కుటుంబాలు ఉంటున్నాయి?
- ఆ ఇంట్లో వివాహమైన కుటుంబాలు ఎన్ని?
- కుటుంబంలో ఎంతమంది ఉన్నారు?
- ప్రస్తుతం ఇంట్లో ఎంతమంది నివసిస్తున్నారు?
- ఇంటి పెద్ద ఎవరు (మేల్ / ఫిమేల్)
- ఇంటి పెద్ద ఎస్సీ/ఎస్టీకి చెందినవారా?
- ఇల్లు సొంతమా?.. అద్దెకా?.. లీజుకా?.. (సొంత ఇల్లు ఉన్నా అద్దెకుంటున్నారా? సొంతిల్లు ఉన్నదా? లేదా?)
- ఇంట్లో ఎన్ని గదులు ఉన్నాయి? (బాత్‌రూమ్, టాయ్‌లెట్ మినహాయించి)

## ఇంట్లోని కనీస సౌకర్యాలు :

- తాగునీటి సప్లై (నల్లా ట్రీటెడ్/అన్‌ట్రీటెడ్) ఉన్నదా?
- నీటికి ప్రధాన వనరు (బావి, బోరుబావి, చేతితో కొట్టే పంపు, వర్షపు నీరు, చెరువు, కుంట, నది, ప్యాకేజ్డ్ వాటర్, ట్యాంకర్ వాటర్, ఇంటికి ఎన్ని మీటర్ల దూరం నుంచి తెచ్చుకుంటున్నారు, ఇతరాలు)
- ప్రస్తుతం ఏది వినియోగంలో ఉన్నది?
- ఇంటి లైటింగ్ వినియోగమేంటి? (కరెంటు, కిరోసిన్ దీపం, సోలార్, జనరేటర్, కరెంటు కనెక్షనే లేదా?)
- మరుగుదొడ్డి (టాయ్‌లెట్) ఉన్నదా?
- ఏ తరహా మరుగుదొడ్డి (సెపరేట్ లేదా కామన్ లేదా పబ్లిక్ టాయ్‌లెట్), పైకప్పు ఉన్నదా?
- టాయ్‌లెట్ వినియోగిస్తున్నారా? (టాయ్‌లెట్ ఉన్నా గ్రామాల్లో కొందరు బయటకు వెళ్తుంటారు)
- డ్రైనేజీ కనెక్షన్ (వేస్ట్ వాటర్ ఔట్‌లెట్) ఉన్నదా? క్లోజ్డ్/ఓపెన్, నాలాలోకి వదలడం.
- బాత్‌రూమ్‌లు ఉన్నాయా? వినియోగిస్తున్నారా? వాటికి పైకప్పు ఉన్నదా?
- కిచెన్ రూమ్ ఉన్నదా? ఆరుబయటే వండుకుంటున్నారా? ఎల్పీజీ, పీఎన్జీ, కిరోసిన్ స్టవ్, కరెంట్ (ఇండక్షన్) స్టవ్ .. ఏది వాడుతున్నారు? లేదా కట్టెలపొయ్యి, బయోగ్యాస్, సోలార్, పిడకలు, బొగ్గుల కుంపటి.
- వంటకు ప్రధానంగా దేనిమీద ఆధారపడుతున్నారు?

## హౌస్ లిస్టింగ్‌కు ముందే సన్నాహాలు

సెన్సస్ ఫస్ట్ ఫేజ్‌లో హౌస్ లిస్టింగ్, హౌసింగ్ సెన్సస్ చేయడానికి ముందే రాష్ట్ర సెన్సస్ డైరెక్టర్ కొన్ని సన్నాహాలు చేస్తారు. రెవెన్యూ గ్రామాన్ని ఒక యూనిట్‌గా తీసుకుంటారు. గ్రామాల్లో నివసించే జనాభా సంఖ్యకు అనుగుణంగా బ్లాక్‌లుగా విభజన జరుగుతుంది. ఒక్కో బ్లాక్‌కు స్థానిక సంస్థల మ్యాప్ ప్రకారం (జియో ట్యాగింగ్) బౌండరీలను ఫిక్స్ చేస్తారు. ఆ బౌండరీలకు అనుగుణంగా ఒక్కో బ్లాక్‌కు ఒక ఎన్యూమరేటర్‌ను కేటాయిస్తారు. ఆ ఎన్యూమరేటర్ తన పరిధిలోని ఇండ్లను అంచనా వేసుకుని, ప్రతి ఇంటికి అవసరమయ్యే సెన్సస్ నెంబర్‌ను కేటాయిస్తారు (ఇది వారి రికార్డు అవసరాల కోసమే). ఆ నెంబర్‌ను ఆ ఇంటి గోడపై రాసుకుంటారు. సగటున ఒక్కో ఎన్యూమరేటర్ 800 మంది నుంచి వివరాలు సేకరిస్తారు.

## జవాబుదారీతనంతో వివరాల సేకరణ

ఎన్యూమరేటర్ సేకరించే వివరాల్లో తప్పులు దొర్లకుండా పకడ్బందీ మెకానిజం రూపొందించారు. ప్రతి ఆరుగురు ఎన్యూమరేటర్లకు ఒక సూపర్‌వైజర్ ఉంటారు. ఫస్ట్ టైమ్ పెన్ను, పేపర్ లేకుండా పూర్తిగా డిజిటల్ పద్ధతిలో వివరాలను సేకరిస్తున్నారు. ఈ వివరాలన్నీ మొబైల్ యాప్‌లో స్టోర్ అవుతాయి. వీటిని సెన్సస్ సర్వర్ (వెబ్‌సైట్)లో స్టోర్ (అప్‌లోడ్) చేయడానికి ముందు సూపర్‌వైజర్ నుంచి వ్యాలిడిటీ (అప్రూవల్) తప్పనిసరి అవసరం. ఏ మార్పులు చేసినా మళ్లీ దాన్ని అప్‌లోడ్ చేయాలంటే సూపర్‌వైజర్ నుంచి అనుమతి ఉండాల్సిందే. ఇంటింటి వెరిఫికేషన్ సందర్భంగా ఇంటి పెద్ద నుంచి వివరాలు సేకరించిన తర్వాత అన్నీ సక్రమంగా ఉన్నాయో లేవో ఎన్యూమరేటర్ వారికి చదివి వినిపిస్తారు. వారు ఓకే చెప్పిన తర్వాతనే మొబైల్ యాప్‌లో సేవ్ అవుతాయి. ఆ తర్వాత సైట్‌లో అప్‌లోడ్ చేస్తారు. ఎన్యూమరేటర్ సేకరించిన వివరాలను సూపర్‌వైజర్ పరిశీలించి ఏదైనా తేడా ఉన్నట్లు అనుమానిస్తే స్వయంగా ఫిజికల్ వెరిఫికేషన్ చేపడతారు.

## రాష్ట్రంలో 94 వేల మంది ఎన్యూమరేటర్లు

ప్రస్తుతం తెలంగాణ జనాభా 3.75 కోట్లు ఉన్నట్లు అంచనా. ఏకకాలంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సెన్సస్ వివరాల సేకరణ జరుగుతుంది. మొత్తం 94 వేల మంది ఎన్యూమరేటర్లు అవసరమని గుర్తించిన రాష్ట్ర సెన్సస్ డైరెక్టర్.. ఎక్కువగా టీచర్లను నియమిస్తున్నారు. నెల రోజుల పాటు జరిగే ఈ ప్రక్రియలో ఎన్యూమరేటర్లు వారి మొబైల్ ఫోన్లనే వినియోగించాలి. ఎన్యూమరేటర్ల ఐడీ ఆధారంగా మొబైల్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకుని యూజర్ ఐడీ, పాస్‌వర్డ్ ఇచ్చి లాగిన్ కావాల్సి ఉంటుంది. ప్రతి ఎన్యూమరేటర్‌కు సెన్సస్ అవసరాల కోసం ప్రత్యేక ఐడీ కార్డు ఉంటుంది. దీనిపై క్యూఆర్ కోడ్ కూడా ముద్రించేలా జాగ్రత్తలు తీసుకున్నారు. ఎన్యూమరేటర్ పేరుతో మోసాలు జరగకుండా ఉండేందుకు ప్రజలు ఆ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి వివరాల సేకరణ కోసం వచ్చిన వ్యక్తి నకిలీయా? లేక అసలైన సిబ్బందేనా? అని పరిశీలించుకోవచ్చు.




## సిబ్బందికి పకడ్బందీ శిక్షణ

హౌస్ లిస్టింగ్, హౌసింగ్ సెన్సస్ కోసం ప్రజల నుంచి వివరాలు తీసుకునే ప్రభుత్వ సిబ్బందికి సెన్సస్ డైరెక్టర్ జనరల్ శిక్షణా కార్యక్రమాలను రూపొందించారు. టాప్ లెవల్‌లో ఉండేవారు నేషనల్ ట్రైనర్లు. కిందిస్థాయిలో ఉండేవారు ఎన్యూమరేటర్లు. దేశం మొత్తం మీద వంద మంది నేషనల్ ట్రైనర్లు శిక్షణ తీసుకున్నారు. వీళ్లు దాదాపు 2 వేల మంది మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ ఇచ్చారు. వీరికి కింది స్థాయిలో సుమారు 45 వేల మంది ఫీల్డ్ ట్రైనర్లకు కూడా ట్రైనింగ్ పూర్తయింది. వీళ్లు ఎన్యూమరేటర్లకు శిక్షణ ఇస్తారు. ఇప్పటికే ఒక విడత ట్రైనింగ్ పూర్తయింది. ఈ నెల 18 నుంచి తెలంగాణలోని సుమారు 94 వేల మంది ఎన్యూమరేటర్లకు శిక్షణ ఉంటుంది. ప్రతి బ్యాచ్‌కు 50 మందికి మించకుండా ట్రైనింగ్ ఉంటుంది.

## డూప్లికేషన్ లేకుండా జాగ్రత్తలు

సెన్సస్ ప్రక్రియలో భాగంగా ఏ ఒక్కరూ రికార్డుల్లోకి ఎక్కకుండా ఉండకూడదనే జాగ్రత్తలతో పాటు డూప్లికేషన్ లేకుండా కూడా ప్రత్యేక మెకానిజం సెన్సస్ డైరెక్టర్ జనరల్ రూపొందించారు. ఒక ఫ్యామిలీకి చెందినవారు చదువు, ఉద్యోగం లాంటి అవసరాలతో మరో చోట అద్దె ఇంట్లో ఉంటున్నా, హాస్టల్‌లో ఉంటున్నా ఎన్యూమరేటర్లు సందర్శించినప్పుడు వారి వివరాలను తీసుకుంటారు. అటు సొంత ఊరిలో ఫ్యామిలీ హెడ్ నుంచి తీసుకున్న వివరాల్లో ఎలాగూ ఆ వ్యక్తి కూడా భాగంగా ఉన్నందున.. ఇక్కడ హాస్టల్ లేదా అద్దె ఇంట్లో ఉన్నప్పుడు మరోసారి పేరు ఎక్కకుండా మొబైల్ యాప్‌లో కొన్ని ప్రత్యేక ఆప్షన్స్ ఉన్నాయి. హౌస్ లిస్టింగ్ సందర్భంగా కుటుంబ సభ్యుల నుంచి అడిగే ప్రధాన ప్రశ్నలకు అనుసంధానంగా కొన్ని సప్లిమెంటరీ ప్రశ్నలతో క్రాస్ చెక్ అయ్యి నమోదు కావు. ఆ రకంగా డూప్లికేషన్ అయ్యే అవకాశాల్లేకుండా మొబైల్ యాప్ రూపొందించారు.



## ఇల్లు లేనివాళ్ల వివరాల సేకరణ ఎలా?

దేశంలోని చాలా నగరాలు, పట్టణాల్లో ఎలాంటి ఆవాసం లేకుండా రోడ్ల మీద బతికేవాళ్ల వివరాలనూ ఎన్యూమరేటర్లు నమోదు చేస్తారు. వీరికి ప్రభుత్వం తరఫున ఎలాంటి గుర్తింపూ లేదు.. గుర్తింపు కార్డులూ ఉండవు. కానీ వీరు ఈ దేశ జనాభాలో భాగమే అయినందున వారిని కూడా లెక్కించాలన్నది ప్రభుత్వ ఉద్దేశం. ఒక్కరిని కూడా వదలకూడదనే నినాదాన్ని తీసుకున్నందున వీరి వివరాలను సేకరించడానికి స్పెషల్ మెకానిజం రూపొందించారు. బెగ్గర్లు, ర్యాగ్ పికర్స్, అనాథలు.. ఇలాంటివారు పగలంతా ఎక్కడ ఎలా తిరిగినా రాత్రి సమయానికి పడుకోడానికి ఏదో ఒక ప్రాంతాన్ని ఎంపిక చేసుకుంటారని సెన్సస్ అధికారులు భావిస్తున్నారు. అలాంటి ప్రాంతాలను ముందుగానే గుర్తిస్తారు. మురికి కాల్వలు, సబ్‌వేలు, రైల్ అండర్ బ్రిడ్జిలు, ఫుట్‌పాత్‌లు, ప్రార్థనా స్థలాలు, బస్ స్టేషన్లు, రైల్వే స్టేషన్లు, ట్రాఫిక్ జంక్షన్లు.. ఇలాంటివన్నీ సెన్సస్ అధికారుల దృష్టిలో ఉన్నాయి. స్థానిక సంస్థల సహకారంతో ఈ వివరాలను సేకరిస్తారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న నైట్ షెల్టర్ల నుంచీ వివరాలను సేకరిస్తారు. దీనికోసం ఆకస్మికంగా ఒక రోజు రాత్రి 11 గంటల నుంచి మరుసటి రోజు తెల్లవారుజామున 5 గంటల వరకు సర్‌ప్రైజ్‌గా ఆ ప్రాంతాలను స్థానిక పోలీసుల సహకారంతో సందర్శించి అందరి వివరాలను నమోదు చేస్తారు. మూగ, చెవిటి, మతిస్థిమితం సరిగా లేనివారి వివరాలను కూడా తీసుకుంటారు. ఒకవేళ వివరాలేవీ లేకపోతే ప్రత్యేక కేటగిరీలో నమోదు చేస్తారు.

## వివరాలు కచ్చితంగా చెప్పాల్సిందే..

ఫస్ట్ ఫేజ్, సెకండ్ ఫేజ్ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి వివరాలను సేకరించే సమయంలో ఎన్యూమరేటర్లకు తప్పనిసరిగా వివరాలు చెప్పాల్సిందే. ఆదాయం, టర్నోవర్, ఆస్తులు.. ఇలాంటివేవీ ఎన్యూమరేటర్లు అడిగే ప్రశ్నల్లో లేనందున ఒక విధంగా ప్రజలకు ఎలాంటి ఆందోళన లేనట్టే. తప్పుడు సమాచారం ఇచ్చినా, వాస్తవాలను దాచిపెట్టినా సెన్సస్ చట్టం ప్రకారం చర్యలు తీసుకునే అధికారం సెన్సస్ డైరెక్టర్ జనరల్‌కు ఉంటుంది. వివరాలు ఇవ్వడానికి నిరాకరించే వెసులుబాటు ప్రజలకు లేదు. వివరాలను ప్రభుత్వానికి అందించడం ప్రజల బాధ్యత అని సెన్సస్ విభాగం పేర్కొంటున్నది.

## వివరాలిచ్చిన తర్వాత జనన మరణాలైతే..?

మే 11- జూన్ 9 మధ్య ఎన్యూమరేటర్ ఒక ఇంటికి వచ్చి వివరాలన్నీ నమోదు చేసిన తర్వాత.. ఆ కుటుంబంలో ఎవరైనా చనిపోయినా? లేక కొత్తగా పుట్టినా? ఆ వివరాలు అప్‌డేట్ అయ్యేదెలా?.. ఇలాంటివన్నీ అప్‌డేట్ కావడం కోసం ఫిబ్రవరి 28న సెకండ్ ఫేజ్ సర్వే పూర్తయిన తర్వాత ప్రత్యేకంగా ఐదు రోజుల పాటు ఎన్యూమరేటర్లు డోర్ టు డోర్ విజిట్ చేస్తారు. వివరాలు సేకరించిన తర్వాత జరిగిన జనన, మరణాలను అప్‌డేట్ చేస్తారు. రివిజినల్ ఎన్యూమరేషన్ కోసం మార్చి1-5 తేదీల షెడ్యూల్ ఖరారైంది. ఈ ఐదు రోజుల పాటు ఎన్యూమరేటర్లు ఈ మార్పులను సేకరించి మొబైల్‌లో అప్‌డేట్ చేస్తారు.


## ఎన్ఆర్ఐల వివరాలు తీసుకోరు

జనాభా లెక్కల సేకరణ కేవలం ఈ దేశంలో నివసిస్తున్నవారికే. ఎన్ఆర్ఐ (ప్రవాస భారతీయులు) ల వివరాలను సెన్సస్ అధికారులు సేకరించరు. వారు ఈ దేశంలో నివాసం ఉండనందున అవసరం ఉండదు. అదే సమయంలో కాందిశీకులు, శరణార్థుల వివరాలు మాత్రం నమోదవుతాయి. ఒక్కో రాష్ట్రంలో ఒక్కో తరహా శరణార్థులు ఉంటారు. వారు ఇక్కడే నివసిస్తున్నందున ఆ స్పెషల్ కేటగిరీలో వారి వివరాలు రికార్డుల్లోకి ఎక్కుతాయి. విదేశాల నుంచి చదువు లేదా ఉద్యోగం లేదా దీర్ఘకాల ప్రాజెక్టు వర్క్ కోసం వచ్చి ఇక్కడ నివాసం ఉంటున్నవారి వివరాలను కూడా ఎన్యూమరేటర్లు సేకరిస్తారు. జనాభా లెక్కల సేకరణకు పౌరసత్వంతో సంబంధం ఉండదు.

## సంక్షేమ పథకాలకు లింక్ ఉండదు


సెన్సస్‌లో భాగంగా ప్రజల నుంచి సేకరిస్తున్న వివరాలకు, ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు సంబంధం ఉండదు. ఇక్కడ తీసుకున్న వివరాలేవీ ప్రభుత్వ విభాగాలతో పంచుకునే అవకాశం కూడా ఉండదు. దీంతో ఇప్పుడు వివరాలను వెల్లడిస్తే సంక్షేమ పథకాలు పొందడానికి అర్హత కోల్పోతామనే ఆందోళన అక్కర్లేదని సెన్సస్ అధికారులు చెబుతున్నారు. సేకరిస్తున్న డేటా మొత్తం గోప్యంగా ఉంటుందని, అది సెన్సస్ రిజిస్ట్రార్ జనరల్ దగ్గర మాత్రమే ఉంటుందని, ఏ స్థాయి అధికారి దగ్గర ఉండదని స్పష్టం చేస్తున్నారు. ఈ వివరాలు ఇచ్చినంత మాత్రాన వెల్ఫేర్ స్కీమ్స్ ఫలాలు అందవనే ఆందోళన అవసరం లేదని సర్వే సందర్భంగా ఎన్యూమరేటర్లు ప్రజలకు అవగాహన కల్పిస్తారు.

## స్టేట్ లెవల్‌లో కో–ఆర్డినేషన్ కమిటీ



దేశవ్యాప్తంగా జరిగే మొత్తం సెన్సస్ ప్రక్రియకు కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పనిచేసే సెన్సస్ రిజిస్ట్రార్ జనరల్ చీఫ్‌గా వ్యవహరిస్తారు. ప్రతి రాష్ట్రానికి ఆయన కింద పనిచేసేలా సెన్సస్ డైరెక్టర్ ఉంటారు. ఈ ప్రక్రియ మొత్తం కేంద్ర ప్రభుత్వ పరిధిలో జరుగుతున్నా.. ఎగ్జిక్యూషన్ మాత్రం రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతోనే సాధ్యమవుతుంది. ప్రతి రాష్ట్రానికి స్టేట్ లెవల్ సెన్సస్ కో-ఆర్డినేషన్ కమిటీ ఉంటుంది. ఆ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి లేదా కేంద్రపాలిత ప్రాంత అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ చీఫ్‌గా ఉంటారు. ఈయనతో పాటు రాష్ట్ర సెన్సస్ డైరెక్టర్, సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి (పొలిటికల్) సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీ ఆధ్వర్యంలోనే రాష్ట్రంలో సెన్సస్ ప్రక్రియ జరుగుతుంది. రాష్ట్ర జనాభా, రెవెన్యూ గ్రామాల ఆధారంగా స్థానిక సంస్థల నుంచి తీసుకున్న మ్యాప్‌కు అనుగుణంగా ఎన్యూమరేటర్ల సంఖ్య ఖరారవుతుంది. వీరిని సమకూర్చే బాధ్యత ఈ కమిటీదే.

## కమిటీ నేతృత్వంలో ఫీల్డ్ స్టడీ




స్టేట్ లెవల్ సెన్సస్ కో-ఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో జరిగే ఫస్ట్, సెకండ్ ఫేజ్ సెన్సస్ ప్రక్రియలో బహుళ అంచెల వ్యవస్థ ఉంటుంది. మానిటరింగ్ ఆఫీసర్లుగా రాష్ట్ర నోడల్ ఆఫీసర్, రాష్ట్ర సెన్సస్ డైరెక్టర్, ప్రిన్సిపల్ సెన్సస్ ఆఫీసర్ వ్యవహరిస్తారు. జిల్లా స్థాయిలో డిస్ట్రిక్ట్/ప్రిన్సిపల్ సెన్సస్ ఆఫీసర్‌గా కలెక్టర్ వ్యవహరిస్తారు. వాళ్ల కింద ఆర్డీవో స్థాయి అధికారులు డివిజనల్ సెన్సస్ ఆఫీసర్లుగా ఉంటారు. మున్సిపల్ కార్పొరేషన్లలో కమిషనర్లు ఆ పరిధిలో ప్రిన్సిపల్/అడిషనల్ ప్రిన్సిపల్ సెన్సస్ ఆఫీసర్లుగా, చార్జ్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తారు. మండల స్థాయిలో తహసీల్దార్లు సెన్సస్ ఆఫీసర్లుగా వ్యవహరిస్తారు. ఒకటి లేదా కొన్ని గ్రామాలకు సూపర్‌వైజర్లు ఉంటారు. గ్రామ స్థాయిలో ఎన్యూమరేటర్లు ఉంటారు. వీళ్లు సేకరించే మొత్తం సమాచారం సెన్సస్ మేనేజ్‌మెంట్ అండ్ మానిటరింగ్ సిస్టమ్‌లో (సీఎంఎంఎస్) డేటా రూపంలో స్టోర్ అవుతుంది.

## సెకండ్ ఫేజ్ ప్రశ్నావళి పెండింగ్



ఫస్ట్ ఫేజ్‌లో జరిగే హౌస్ లిస్టింగ్, హౌసింగ్ సెన్సస్‌కు అవసరమైన 33 ప్రశ్నలు, అనుబంధ ప్రశ్నలు రెడీ అయినా.. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరిగే సెకండ్ ఫేజ్ జనాభా లెక్కల (పీపుల్ ఎన్యూమరేషన్) సేకరణకు మాత్రం ఇంకా ప్రశ్నలు తయారు కాలేదు. ఆ ప్రశ్నల్లో ఏముంటాయి? అనేది గెజిట్ విడుదలైన తర్వాత క్లారిటీ వస్తుంది. వ్యక్తులకు సంబంధించిన వ్యక్తిగత వివరాలు ఇందులో ఉంటాయి. పేరు, పుట్టినతేదీ, వయసు, కుటుంబ పెద్దతో సంబంధం, విద్యార్హతలు, అక్షరాస్యత, ఉద్యోగం, చేస్తున్న వృత్తి, వివాహం.. ఇలాంటివన్నీ ఉంటాయి. ఈ వివరాలను వెల్లడించిన తర్వాత వాటిని ఆమోదిస్తూ ఎన్యూమరేటర్‌కు సదరు వ్యక్తి రాతపూర్వకంగా (డిజిటల్ సిగ్నేచర్) తెలియజేయాల్సి ఉంటుంది. సెకండ్ ఫేజ్ సర్వే కోసం ఇంకా స్పష్టమైన మార్గదర్శకాలు తయారుకాలేదు.

## సెకండ్ ఫేజ్ ప్రశ్నలపైనే ఎక్కువ ఆసక్తి

ఫస్ట్ ఫేజ్ హౌస్ లిస్టింగ్, హౌసింగ్ సెన్సస్ కావడంతో మొత్తం 33 ప్రశ్నలు ఉంటాయి. రెసిడెన్షియల్, నాన్-రెసిడెన్షియల్ భవనాలు, ఆవాసాలు, ఇండ్లు లేని కుటుంబాల సంఖ్య, ఇండ్ల స్వభావం, ఇంట్లో ఉన్న కనీస సౌకర్యాలు, ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్స్, ఒక మేరకు కుటుంబాల ఆర్థిక స్థోమత అంచనా.. ఇలాంటివన్నీ తెలుస్తాయి. కానీ సెకండ్ ఫేజ్‌లో జరిగే జనాభా లెక్కల సేకరణ కీలకమైన ఘట్టం. ఒకవైపు జనాభా లెక్కలను సేకరించడం, మరోవైపు ప్రజల కులాలను తెలుసుకోవడం కీలకం. ప్రజల వ్యక్తిగత వివరాలు సెకండ్ ఫేజ్‌లో ఉంటాయి. వయసు, అక్షరాస్యత, చదువు, వివాహం, పిల్లలు, మతం, కులం, మాతృభాష, వృత్తి, ఉద్యోగం, వలసలు, అంగవైకల్యం, ఫెర్టిలిటీ రేట్.. ఇలాంటివన్నీ ఉంటాయి. అయితే వీటిని సేకరించడానికి ఎన్ని ప్రశ్నలుంటాయి? అనుబంధంగా ఎలాంటి ప్రశ్నలు అడుగుతారు? కులం చెప్పడానికి ఇష్టం లేకపోతే ఎలాంటి ఆప్షన్ ఉంటుంది? ఇలాంటివన్నీ ఆసక్తికరం. సెన్సస్ రిజిస్ట్రార్ జనరల్ కార్యాలయం ఇంకా ప్రశ్నావళిని తయారు చేయలేదు. ఇంకా 10 నెలల సమయం ఉంది. గెజిట్ విడుదలతో క్లారిటీ రానున్నది.

## ఫిబ్రవరి 28 తర్వాత నో అప్‌డేట్

సెన్సస్ రిజిస్ట్రార్ జనరల్ జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం రిఫరెన్స్ డేట్ 2027 ఫిబ్రవరి 28 అర్ధరాత్రి 12 గంటల వరకు మాత్రమే. అప్పటి వరకు బతికున్న, పుట్టిన, చనిపోయినవారి వివరాలు మాత్రమే జనాభా లెక్కల్లోకి చేరతాయి. ఆ తర్వాత పుట్టినవారు లేదా చనిపోయినవారి వివరాలు చేరవు. ఫస్ట్ టైమ్ డిజిటల్ సర్వే చేస్తున్నందున సమగ్ర నివేదికను తయారు చేయడానికి గతంలో పట్టినట్లుగా నాలుగైదేండ్లు అవసరం ఉండదు. ప్రభుత్వానికి రిపోర్టు ఎప్పుడు సబ్మిట్ చేస్తామనేది రిజిస్ట్రార్ జనరల్ డిసైడ్ చేస్తారు. అన్ని గ్రామాల నుంచి మార్చి ఫస్ట్ వీక్ వరకు వచ్చే డేటాను విశ్లేషించి, కంపైల్ చేసి వేర్వేరు విభాగాల్లో రిపోర్టులు తయారవుతాయి. అక్షరాస్యత, జనాభా, మౌలిక సౌకర్యాలు, ఇంటి వసతి, శరణార్థులు, కాందిశీకులు, బెగ్గర్లు.. ఇలా రకరకాల కేటగిరీలతో రిపోర్టు ఉండొచ్చు.

## నాన్-సెన్సస్ డేటా సేకరణ సైతం

జనాభా లెక్కల సేకరణ ఫస్ట్, సెకండ్ ఫేజ్ తర్వాత రివిజనల్ సర్వే నిర్వహించి వివరాలు సేకరించే ఎన్యూమరేటర్లు.. నాన్-సెన్సస్ డేటాను సైతం నమోదు చేయనున్నారు. గ్రామాల్లో, పట్టణాల్లో మౌలిక సౌకర్యాలు, రోడ్లు, కరెంటు వసతి, చెరువులు, నీటి వనరులు.. ఇలా అన్నీ సేకరిస్తారు. ఇవేవీ సెన్సస్‌తో ప్రత్యక్షంగా సంబంధం లేని అంశాలైనప్పటికీ వచ్చే ఏడాది మార్చిలో సెకండ్ ఫేజ్ సర్వే పూర్తయిన తర్వాత నాన్-సెన్సస్ గణాంకాలను ఎన్యూమరేటర్లు సేకరిస్తారు. దీనికి షెడ్యూలు ఫిక్స్ కావాల్సి ఉన్నది. ఏ రాష్ట్రంలో ఎలాంటి మౌలిక సౌకర్యాలు ఉన్నాయో ఈ గణాంకాలు వెల్లడిస్తాయి. వీటి ఆధారంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మౌలిక సదుపాయాల అభివృద్ధిపై దృష్టి పెట్టడానికి, నిధులు కేటాయించడానికి వీలు కలుగుతుంది.





## సెన్సస్‌తో ప్యూర్ క్వాలిటీ డేటా..

సెన్సస్ ప్రక్రియను పూర్తి పారదర్శకంగా నిర్వహించనున్నాం. దాదాపు 135-140 కోట్ల మంది వివరాలను సేకరించే ఈ ప్రక్రియ సులభమైనదేమీ కాదు. కానీ ఛాలెంజింగ్‌గా తీసుకుని చేయబోతున్నాం. బ్రిటిష్ హయాం నుంచి చూస్తే ఇది 16వ సెన్సస్. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత 8వది. దేశవ్యాప్తంగా సుమారు 34 లక్షల మంది ఎన్యూమరేటర్లు ఉంటారు. తెలంగాణలో 94 వేల మంది పని చేస్తారు. రెండు ఫేజ్‌లుగా నిర్వహిస్తున్నాం. స్వతంత్ర భారత్‌లోనే ఫస్ట్ టైమ్ కులగణన జరుగుతున్నది. ఫస్ట్ టైమ్ డిజిటల్ పద్ధతిలో జరుగుతున్నది. తెలంగాణ ఏర్పడిన తర్వాత ఈ సెన్సస్ ఫస్ట్ టైమ్. ఎన్యూమరేటర్లకు ట్రైనింగ్ ఇస్తున్నాం. ఎలాంటి సందేహాలకు తావులేకుండా పకడ్బందీగా జనగణన చేపడుతున్నాం. ఒకే వ్యక్తి రెండుసార్లు నమోదు కాకుండా (డూప్లికేషన్ లేకుండా) అనుబంధ ప్రశ్నలు ఉపయోగపడతాయి. ఒక్కరు కూడా సెన్సస్ నుంచి మిస్ కావొద్దని అనేక కోణాల నుంచి ఆలోచించి యాక్షన్ ప్లాన్ రెడీ చేశాం. సెన్సస్ నిర్వహణ కేంద్ర ప్రభుత్వ బాధ్యత అయినా రాష్ట్ర ప్రభుత్వాలు ఎగ్జిక్యూషన్ రోల్ పోషిస్తాయి. ఇది సహకార సమాఖ్య స్ఫూర్తికి నిలువెత్తు నిదర్శనం. ఫస్ట్ ఫేజ్‌లో నెల రోజులు, సెకండ్ ఫేజ్‌లో నెల రోజులు డోర్ టు డోర్ సర్వే చేసి వివరాలను సేకరించడం పకడ్బందీ ప్రణాళికతో జరుగుతుంది. ఎక్కడా లోపాలు, పొరపాట్లు లేకుండా చర్యలు తీసుకున్నాం. అందుకే ఇది పూర్తిస్థాయి క్వాలిటీ డేటా. వివరాలు లీక్ అవుతాయేమో.. గోప్యంగా ఉండవేమో.. ప్రభుత్వ శాఖలకు ఇస్తే సంక్షేమ పథకాలు కట్ అవుతాయేమో.. అనే అనుమానాలు అక్కర్లేదు. సెన్సస్ డేటాకు, వెల్ఫేర్ స్కీమ్స్ కు అసలు సంబంధమే ఉండదు. ఏ శాఖకూ ఈ వివరాలు ఇవ్వం. సమగ్ర వివరాలు సెన్సస్ ప్రక్రియలో పాల్గొనే ఏ ఒక్కరి దగ్గరా ఉండవు. అందరూ సమాచారం ఇవ్వాల్సిందే. తప్పుడు సమాచారం ఇచ్చినా, తప్పుగా నమోదు చేసినా సెన్సస్ చట్టం ప్రకారం చర్యలు తప్పవు.

**- భారతి హోళికెరి, స్టేట్ సెన్సస్ డైరెక్టర్**